# 'స్థానిక' ఎన్నికలకు సమాయత్తం కావాలి

- రాష్ట్ర ఎన్నికల కమిషనర్ పార్థసారధి
- వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్లు, ఇతర ఉన్నతాధికారులకు దిశానిర్దేశం

రంగారెడ్డి, ఆగస్టు 29(నమస్తే తెలంగాణ): స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు అన్ని విధాలా సమాయత్తం కావాలని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ సి. పార్థసారధి జిల్లా ఉన్నతాధికారులకు సూచించారు. క్షేత్రస్థాయిలో ఎన్నికల ఏర్పాట్లను పకడ్బందీగా చేపట్టాలని ఆదేశించారు. గురువారం రాష్ట్ర ఎన్నికల కమిషనర్ పార్థసారధి జిల్లా కలెక్టర్లు, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్లు, జడ్పీ సీఈఓలు, డీపీఓలు, ఎన్నికల రిటర్నింగ్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.

ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. వచ్చే నాలుగైదు నెలల్లో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించనున్నట్లు తెలిపారు. మూడు దశల్లో గ్రామపంచాయతీ ఎన్నికలు, తర్వాత ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు, చివరగా మున్సిపల్ ఎన్నికలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. జిల్లా ఎన్నికల అధికారులైన కలెక్టర్లు ఏర్పాట్లను నిశితంగా పర్యవేక్షించాలని సూచించారు. శాసనసభ, పార్లమెంటు ఎన్నికలతో పోలిస్తే, పార్టీలకతీతంగా జరిగే స్థానిక సంస్థల ఎన్నికలు సున్నితత్వంతో కూడుకున్నవని, ఎలాంటి ఫిర్యాదులకు ఆస్కారం లేకుండా ప్రశాంత వాతావరణంలో, పారదర్శకంగా నిర్వహించేందుకు అవసరమైన చర్యలను చేపట్టాలని ఆదేశించారు. ఓటరు జాబితా రూపకల్పన, పోలింగ్ కేంద్రాల మ్యాపింగ్ వంటి ప్రక్రియలను తక్షణమే చేపట్టి నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలన్నారు. సెప్టెంబర్ 6న ఓటరు జాబితా డ్రాఫ్ట్ నోటిఫికేషన్ వెలువరించి అభ్యంతరాలు స్వీకరించాలని, 21న తుది జాబితాను ప్రకటించాల్సి ఉంటుందన్నారు. మార్పులు, చేర్పులకు సంబంధించిన అభ్యర్థనలను పరిశీలించి ఓటరు జాబితాలో చేర్చే అధికారం కేవలం ఎన్నికల రిటర్నింగ్ అధికారులకు మాత్రమే ఉంటుందని స్పష్టం చేశారు.

పంచాయతీరాజ్ చట్టం-2018తో పాటు, స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు సంబంధించిన నిబంధనలపై పూర్తి అవగాహన ఏర్పరచుకోవాలని, ఎన్నికల నిర్వహణలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్లు క్రియాశీలక పాత్ర పోషించాలని తెలిపారు. అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా ఉన్న ఓటరు జాబితాను గ్రామ పంచాయతీల వారీగా రూపొందించుకోవాలని, అర్హులైన ఓటరు పేర్లు గల్లంతు కాకుండా జాగ్రతలు తీసుకోవాలని సూచించారు. రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశమై ఓటరు జాబితా, పోలింగ్ కేంద్రాల ఏర్పాటుపై చర్చించాలన్నారు. సమస్యాత్మక, అతి సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించి ప్రశాంత వాతావరణంలో నిష్పక్షపాతంగా ఎన్నికలు జరిపించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని ఎన్నికల కమిషనర్ సూచించారు. ఎంపీడీఓలు తమ మండలాల పరిధిలోని పోలింగ్ కేంద్రాలను క్షేత్రస్థాయిలో సందర్శించి వాటి స్థితిగతులను పరిశీలించేలా చూడాలన్నారు. ఒక్కో పోలింగ్ కేంద్రం పరిధిలో 600 వరకు ఓట్లు ఉండేలా చర్యలు తీసుకోవాలని, ఓటర్ల సంఖ్య 650 దాటితే అదనపు పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేయాలన్నారు. ఒక వార్డులోని ఓటరుకు మరో వార్డులో ఓటు హక్కు ఉండకుండా జాగ్రత వహించాలని, ఒకే కుటుంబానికి చెందిన ఓటర్ల ఓటు ఒకేచోట ఉండేలా చూడాలన్నారు. ఎన్నికల ఏర్పాట్లకు అత్యంత ప్రాధాన్యతమిస్తూ, అధికారులంతా విధులను సమర్థవంతంగా నిర్వహించాల స్పష్టం చేశారు.


వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న రంగారెడ్డి జిల్లా ఉన్నతాధికారులు

బ్యాలెట్ బాక్సులు, ఇతర ఎన్నికల సామగ్రిని సమకూర్చుకోవాలని, అవసరమైన పోలింగ్ సిబ్బందిని గుర్తించి, వారికి శిక్షణ తరగతులు ఏర్పాటు చేయాలని, ర్యాండమైజేషన్ ద్వారా పోలింగ్ కేంద్రాల్లో విధులను కేటాయించేలా చర్యలు తీసుకోవాలని అన్నారు.

జిల్లా పంచాయతీ కార్యాలయాలతో పాటు మండల స్థాయిలోనూ ప్రత్యేకంగా ఎలక్షన్ సెల్‌లను ఏర్పాటు చేసి, పర్యవేక్షించాలని పేర్కొన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్, పంచాయతీ అధికారి సురేశ్‌మోహన్, ఇబ్రహీంపట్నం,కందుకూరు ఆర్డీఓలు అనంత్‌రెడ్డి, సూరజ్‌కుమార్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

### కులాల వారీగా ఓటరు జాబితా పంపాలి : వికారాబాద్ కలెక్టర్

వికారాబాద్: రాష్ట్ర ఎన్నికల కమిషనర్ సి. పార్థసారధి వీడియో కాన్ఫరెన్స్ అనంతరం వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్ జైన్ మాట్లాడారు. జిల్లాలో 20 మండలాల్లో ఎంత మంది ఓటర్లు ఉన్నారు.. ఎస్సీ, ఎస్టీ, బీసీ కులాల వారీగా జాబితా ఇవ్వాలని మండలాధికారులను ఆదేశించారు. అదేవిధంగా జిల్లాలో మొత్తం మహిళలు, పురుష ఓటర్లు ఎంత మంది ఉన్నారనే విషయాన్ని ఫిజికల్ వెరిఫికేషన్ చేసి జాబితా తయారు చేయాలని సూచించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్, ట్రైనీ కలెక్టర్ ఉమాహారతి, ఆర్డీఓ వాసుచంద్ర, ఇన్‌చార్జి డీపీఓ సంధ్యారాణి, డీఎల్‌పీఓ తాండూర్ శంకర్‌నాయక్, ఇతర అధికారులు పాల్గొన్నారు.


వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్ జైన్, అధికారులు

# ప్రపంచశాంతికి పాటుపడాలి

- ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క
- కన్హాలో వెల్ నెస్ బై హార్ట్‌ఫుల్ నెస్ సెంటర్ ప్రారంభం


కన్హాలో వెల్‌నెస్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న ఉప ముఖ్యమంత్రి భట్టివిక్రమార్క, ధ్యాన గురువు కమలేశ్ పటేల్, షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

నందిగామ, ఆగస్టు 29 : ప్రతి ఒక్కరూ ప్రపంచశాంతికి పాటుపడాలని ఉపముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క అన్నారు. మండలంలోని కన్హా శాంతి వనంలో హార్ట్‌ఫుల్‌నెస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వెల్‌నెస్ సెంటర్‌ను ధ్యాన గురువు కమలేశ్ పటేల్, షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌తో కలిసి గురువారం ఉప ముఖ్యమంత్రి ప్రారంభించారు. అనంతరం వారు మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమత్రి భట్టివిక్రమార్క మాట్లాడుతూ.. ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన శ్రీరామచంద్ర మిషన్, హార్ట్‌ఫుల్‌నెస్ ధ్యాన కేంద్రం తెలంగాణలో ఏర్పాటు చేయడం గొప్ప విషయమన్నారు. ఇక్కడ కులమత బేధం లేకుండా ఉచితంగా ధ్యాన శిక్షణ ఇస్తున్నారని పేర్కొన్నారు. హైడ్రోథెరపీ, ఆయుర్వేదం, నేచురోపతి, హోమియోపతి, పోలారిటీ హీలింగ్, యోగా వంటి చికిత్సలను ఏర్పాటు చేయడంపై నిర్వాహకులను అభినందించారు. ధ్యానంతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని, ప్రతి ఒక్కరూ ధ్యానాన్ని జీవితంలో భాగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వెల్‌నెస్ చీఫ్ మెడికల్ డైరెక్టర్ డాక్టర్ శ్రీవర్మ, సంస్థ ప్రతినిధులు, మాజీ ఎంపీపీలు శివశంకర్‌గౌడ్, ప్రియాంకగౌడ్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

### చేగూరులో ప్రభుత్వ దవాఖాన ఏర్పాటు చేయాలని ఉప ముఖ్యమంత్రికి వినతి

మండలంలోని చేగూరులో 30 పడకల ప్రభుత్వ అసుపత్రిని ఏర్పాటు చేయాలని ఉప ముఖ్యమంత్రి భట్టివిక్రమార్కకు మాజీ ఎంపీపీలు శివశంకర్‌గౌడ్, ప్రియాంకగౌడ్ వినతిపత్రం అందజేశారు.

# ఉదయం రెక్కీ.. రాత్రి చోరీ

## జల్సాల కోసం దొంగతనాలు

- తాళం వేసిన దుకాణాలే టార్గెట్
- నిందితులంతా పాత నేరస్తులు
- వివరాలు వెల్లడించిన ఏసీపీ రంగస్వామి

షాద్‌నగర్‌రూరల్, ఆగస్టు 29 : జల్సాలకు అలవాటుపడి చోరీలకు పాల్పడుతున్న బెంగళూరుకు చెందిన పాత నేరస్తులను షాద్‌నగర్ పోలీసులు చాకచక్యంగా పట్టుకున్నట్లు ఏసీపీ రంగస్వామి తెలిపారు. ఈ నెల 19న షాద్‌నగర్ పట్టణ కూడలిలోని జీఆర్ ఎలక్ట్రానిక్స్, ఇతర దుకాణాల షట్టర్లను తెరిచి దోపిడీకి పాల్పడిన నిందితులను అరెస్టు చేసినట్లు పేర్కొన్నారు. గురువారం షాద్‌నగర్ పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఏసీపీ విలేకరుల సమావేశంలో చోరీలకు సంబంధించి వివరాలు వెల్లడించారు.


వివరాలను వెల్లడిస్తున్న ఏసీపీ రంగస్వామి

బెంగళూరుకు చెందిన పాత నేరస్తులు గంగాధర్ మరో ఐదుగురు గ్రూపుగా ఏర్పడి షాద్‌నగర్‌లోని దుకాణాలను ఉదయం రెక్కీ నిర్వహించి రాత్రి సమయాల్లో ఆయా దుకాణాల తాళాలను పగలగొట్టి చోరీలకు పాల్పడేవారు. చోరీ సమయంలో ఒక వ్యక్తి వాహనంలో ఉండగా మిగిలిన వారు తమ బలాన్ని ఉపయోగించి షట్టర్‌ను తెరిచి దుకాణంలో ఉన్న నగదును అపహరించేవారు. దొంగలించిన నగదుతో జల్సాలు చేయడం అలవాటుగా చేసుకున్నారు. కాగా నిందితులంతా పాత నేరస్తులని ఏసీపీ పేర్కొన్నారు.

చోరీ కేసులో ఏ 1గా ఉన్న గంగాధర్‌తో పాటు అనిల్‌ను బెంగళూరు పోలీసులు అరెస్టు చేయగా కర్ణాటక దొండబాలాపూర్‌కు చెందిన హన్మంత్‌రాజ్, పృథ్వీరాజ్‌ను షాద్‌నగర్ పోలీసులు అరెస్టు చేశారని తెలిపారు. మరో ఇద్దరు నేరస్తులైన అభి, శశిలు పరారీలో ఉన్నట్లు తెలిపారు. వీరంతా షాద్‌నగర్‌లో సుమారు రూ. 4లక్షలు దోపిడీ చేయగా అందులో రూ. 10వేల నగదు రికవరీ చేశామన్నారు. దోపిడీకి ఉపయోగించిన మహేంద్ర ఎక్స్‌యూవీ వాహనాన్ని సీజ్ చేశామన్నారు. ఈ ముఠా షాద్‌నగర్‌తో పాటు షాబాద్, మొయినాబాద్‌నూ దోపిడీలకు పాల్పడినట్లు ఏసీపీ తెలిపారు.

కమిషనర్ ఆఫ్ పోలీస్ మహతి ఆదేశాల మేరకు శంషాబాద్ డీసీపీ రాజేశ్, డీసీపీ క్రైమ్ నర్సింహులు, ఏసీపీ శశాంక్‌రెడ్డి ఆధ్వర్యంలో సీఐలు పవన్, విజయ్‌కుమార్, ఎస్ఐ శరత్, సిబ్బంది వారం రోజుల్లో నిందితులను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. నేరస్తులను పట్టుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించిన పోలీసులను ఏసీపీ అభినందించారు.

# క్రీడలతో ఆరోగ్యం

- జాతీయ క్రీడా దినోత్సవంలో పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

పరిగి, ఆగస్టు 29 : క్రీడలు ఆరోగ్యానికి దోహదపడతాయని పరిగి ఎమ్మెల్యే టీ. రామ్మోహన్‌రెడ్డి అన్నారు. హాకీ మాంత్రికుడు, మేజర్ ధ్యాన్‌చంద్ జయంతి సందర్భంగా గురువారం పరిగి ఇండోర్ స్టేడియంలో ఏర్పాటు చేసిన జాతీయ క్రీడా దినోత్సవంలో కలెక్టర్ ప్రతీక్‌జైన్, ప్రజాప్రతినిధులతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ క్రీడల పట్ల ప్రతి ఒక్కరూ ఆసక్తిని కనబర్చాలని, క్రీడలు మానసికోల్లాసానికి దోహదపడ తాయని తెలిపారు.

నియోజకవర్గంలో క్రీడల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానన్నారు. కులకచర్ల మండలంలో మినీస్టేడియం నిర్మాణానికి స్థల సేకరణ చేశామని త్వరలోనే పనులు ప్రారంభిస్తామని తెలిపారు. పరిగి ఇండోర్ స్టేడియంలో మరో రెండు హైమాస్ట్ లైట్లు త్వరలోనే ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. వచ్చే నెల 10, 11 తేదీల్లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రూ. 3500 కోట్లతో నిర్మించనున్న నేవీ రాడార్‌కు శంకుస్థాపన చేయనున్నారని చెప్పారు. ఈ సందర్భంగా పరిగి అభివృద్ధికి నిధులను కేటాయించాలని సీఎంను కోరనున్నట్లు ఆయన తెలిపారు.


కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే టీ రామ్మోహన్‌రెడ్డి, పాల్గొన్న కలెక్టర్ ప్రతీక్‌జైన్

### విద్యార్థులు క్రీడల్లో రాణించాలి : కలెక్టర్ ప్రతీక్‌జైన్

ప్రతి విద్యార్థి ఏదో ఒక ఆటలో ప్రతిభ కనబర్చాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్ సూచించారు. క్రీడలు శారీరక, మానసికోల్లాసానికి దోహదపడతాయని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వివిధ అంశాలను కలెక్టర్ వివరించారు.

### ఎస్సీ, ఎస్టీ, బీసీ హాస్టల్ వార్డెన్ల సలహా సంఘం సమావేశం

అనంతరం పరిగిలో ఎమ్మెల్యే ఆధ్వర్యంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ హాస్టల్ వార్డెన్ల సలహా సంఘం సమావేశం నిర్వహించారు. వార్డెన్లు తమ హాస్టళ్లలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్యే ఆదేశించారు. సమస్యలను తనకు రాతపూర్వకంగా అందజేస్తే పరిష్కారం కోసం కృషిచేస్తానన్నారు. విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా ఎస్సీ, ఎస్టీ, బీసీ వెల్ఫేర్ అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. అనంతరం పరిగిలో బార్ అసోషియేషన్ ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే పాల్గొనగా న్యాయవాదులు ఆయన్ను ఘనంగా సన్మానించారు.

## ఎంబీఏ పరీక్ష తేదీల ఖరారు

ఉస్మానియా యూనివర్సిటీ, ఆగస్టు 29: ఓయూ పరిధిలోని బీఎస్-ఎంఎస్ (కంప్యూటర్ సైన్స్-ఐదేళ్ల ఇంటిగ్రేటెడ్ డ్యుయల్ డిగ్రీ ప్రోగ్రాం) పరీక్ష ఫీజును స్వీకరించనున్నట్లు ఎగ్జామినేషన్స్ కంట్రోలర్ ప్రొఫెసర్ రాములు ఒక ప్రకటనలో తెలిపారు. బ్యాక్‌లాగ్, ఇంప్రూవ్‌మెంట్ పరీక్ష ఫీజును వచ్చేనెల 11లోగా చెల్లించాలని చెప్పారు.

# వాహనాలు.. కాలుష్య వాహకాలు

- నగరంలో సుమారు 80 లక్షలకు పైగా వెహికిల్స్
- రోజుకు 1500 టన్నుల కాలుష్యకారకాలు విడుదల
- కాలుష్యాన్ని కట్టడి చేద్దామని ఆర్టీఏ పిలుపు
- నిబంధనలకు విరుద్ధంగా రోడ్డెక్కుతున్న వాహనాలపై నజర్



సిటీబ్యూరో, ఆగస్టు 29 (నమస్తే తెలంగాణ) : కాలుష్యం భయానకమైనది. ఆ ప్రభావంతో అటు వాతావరణం.. ఇటు ఆరోగ్యానికి ఎంతటి ముప్పు వాటిల్లుతుందో అందరికీ తెలిసిందే. ఫ్యాక్టరీల నుంచి విడుదలయ్యే ఉద్గారాలు ఓ వైపు.. వాహనాల నుంచి వెలువడే కాలుష్యం మరోవైపు... వెరసి పొల్యూషన్ పరిమితికి మించి పెరిగిపోతున్నది. ఈ నేపథ్యంలో ఆర్టీఏ అధికారులు కాలుష్యాన్ని కట్టడి చేసేందుకు నడుంబిగించారు. కాలుష్య వివరాలను వాహనదారులకు తెలియజేస్తూ అప్రమత్తం చేస్తున్నారు. కాలుష్యాన్ని కట్టడి చేద్దాం అంటూ పిలుపునిస్తున్నారు. బాధ్యతగా తీసుకుని ప్రతి ఒక్కరూ తమ వాహనాల వినియోగంలో పొల్యూషన్ తగ్గించే నియమాలను చేపట్టాలని సూచిస్తున్నారు. ముఖ్యంగా గ్రేటర్ హైదరాబాద్‌లో వాహనాల సంఖ్య రోజురోజుకు పెరుగుతోంది. అదే స్థాయిలో కాలుష్యం అధికమవుతోంది. నివారణ చర్యలు తీసుకోవడంలో భాగంగా ఆర్టీఏ అధికారులు పొల్యూషన్ వివరాలను ఆన్‌లైన్‌లో అప్‌డేట్ చేస్తూ దిశానిర్దేశం చేస్తున్నారు.

గ్రేటర్ హైదరాబాద్‌లో సుమారు 80 లక్షలకు పైన వాహనాలు ఉన్నాయి. వాటి నుంచి రోజుకు 1500 టన్నులకు పైగా కాలుష్యకారకాలు విడుదలవుతున్నాయని ఆర్టీఏ అధికారులు చెబుతున్నారు.

### కఠిన చర్యలకు ప్రణాళికలు..

వాహనాల కాలుష్య తనిఖీలు ఇక మీదట పకడ్బందీగా జరగనున్నాయి. పాత వాహనాలతో రోడ్లెక్కుతున్న వారిపై కఠిన చర్యలకు ఆర్టీఏ అధికారులు చర్యలు తీసుకోనున్నారు. అందులో భాగంగానే పొల్యూషన్ వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు. ఇప్పటి వరకు ప్రైవేటు సంస్థలు వాహనాల కాలుష్య తనిఖీలు చేసి సర్టిఫికెట్స్ జారీ చేస్తున్నాయి. అయితే వారిచ్చే రీడింగ్స్ వివరాలు ఎంత వరకు సరైనవోననే అనుమానాలు కొంతమందిలో ఉన్నాయి. ఈ వివరాలు అన్నీ సెంట్రల్ సర్వర్‌లో అప్‌లోడ్ అయ్యేలా చర్యలు తీసుకుంటున్నారు. తాజాగా పొల్యూషన్ తనిఖీల్లో ఇటీవల 25 ద్విచక్ర వాహనాలను, 14 ఫోర్ వీలర్స్‌ను ఆర్టీఏ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ముఖ్యంగా స్కూల్ బస్సులు పొల్యూషన్ టెస్టులు తప్పనిసరిగా చేయించుకోవాలని అధికారులు సూచించారు. స్కూల్‌జోన్లలో ప్రత్యేకంగా తనిఖీలు చేపడుతూ పొగలు చిమ్ముతున్న వాహనాలను ఆర్టీఏ అధికారులు సీజ్ చేస్తున్నారు. కాలుష్యంతో చిన్నారులకు అత్యధిక ముప్పు ఉంటుందని వైద్యులు హెచ్చరిస్తున్నారు.

# నోరు తెరిస్తే.. తిట్లే!

## చర్చనీయాంశంగా ఓ జోన్ డీసీపీ వ్యవహారం



సిటీబ్యూరో, ఆగస్టు 29 (నమస్తే తెలంగాణ): ఓ జోన్ డీసీపీ తిట్ల పురాణం పోలీస్ శాఖలో ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. బాస్ కుడి భుజంగా మారిన సదరు అధికారి.. నోటి దురుసుతో సిబ్బంది తీవ్ర మానసిక శోభకు గురవుతున్నారు. మరికొందరు ఆ జోన్‌లో పనిచేయాలంటేనే భయపడిపోతున్నారు. 'మాకు లా అండ్ ఆర్డర్ వద్దు బాబోయ్' అంటూ వెనక్కి వెళ్లిపోతున్నారు. సదరు డీసీపీ వచ్చారంటే.. విరుచుకుపడటం.. తిట్టుడే ఉంటుందని.. మేం కూడా మనుషులమేనంటూ.. సిబ్బంది తమ బాధలను తోటివారికి చెప్పుకొని.. కుమిలిపోతున్నారు. అవినీతి, అక్రమాలకు తావు లేకుండా పౌరులకు పారదర్శకంగా సేవలు అందించాలన్న ధ్యేయంతో అధికారులు సిబ్బందికి సూచనలు, సలహాలు ఇవ్వడం.. సున్నితంగా మందలించడం సాధారణమే. ఇందులో కొన్ని సందర్భాల్లో విధి నిర్వహణలో నిర్లక్ష్యం, తప్పు చేశారన్న సమాచారం ఉన్నప్పుడు పై అధికారిగా సిబ్బందిని మందలించడం అప్పుడప్పుడు జరుగుతుంది. ఇలాంటి విషయాల్లో కిందిస్థాయి సిబ్బంది కూడా తప్పు చేశాం కాబట్టి.. మరోసారి ఆ తప్పు చేయవద్దనే తమ పై అధికారి మందలించారనే భావనలో ఉంటారు. అయితే కొందరు అధికారులు మాత్రం అతిగా చేస్తున్నారు. సదరు జోన్ డీసీపీ పేరు ఎత్తితేనే ఆయన కింద పని చేసే సిబ్బంది వణికిపోతున్నారు. పనిచేయించడంలో కఠినంగా ఉండటం మంచిదే..కానీ తమ కింద పనిచేసే వాళ్లు కదా అనే భావనతో ఇష్టానుసారంగా నోటికి వచ్చినట్లు మాట్లాడటం ఏమిటనేది సిబ్బంది అడుతున్న ప్రశ్న. సిబ్బంది తప్పు చేస్తే ఉపేక్షించకుండా శాఖపరమైన చర్యలు తీసుకోవాలి.. ఇష్టానుసారంగా వ్యక్తిత్వాన్ని కించపరిచే విధంగా తిట్టడం తమను ఎంతో బాధిస్తున్నదని ఆ జోన్‌లో పనిచేసే సిబ్బంది వాపోతున్నారు. ఇప్పటికైనా ఆ అధికారి తన నోటి దురుసుతో సిబ్బంది ఎదుర్కొంటున్న మానసిక శోభను అర్థం చేసుకొని.. తన వ్యవహార శైలిలో మార్పు తెచ్చుకుంటారా..? 'ఉన్నతాధికారుల అండదండలు నాకు ఉన్నంత వరకు నన్ను ఎవరూ ఏమీ చేయలేరు' అనే ధీమాతో ఉంటారా? అనేది వేచి చూడాలి.

# బెడ్లు ఖాళీ లేవు..

- జ్వరపీడితులతో కిక్కిరిసిన గ్రేటర్ ఆస్పత్రులు
- రెండు నెలల్లో 714 డెంగీ కేసులు




సిటీబ్యూరో, ఆగస్టు 29 (నమస్తే తెలంగాణ): 'వైద్యశాలల్లో బెడ్స్ ఖాళీ లేవు'... ఇది సర్కార్ దవాఖాన సిబ్బంది చెబుతున్న మాటకాదు.. ప్రైవేటు వైద్యశాలల్లోనూ అదే పరిస్థితి నెలకొంది. సీజనల్ జ్వరాలతో సర్కార్ దవాఖానలే కాకుండా ప్రైవేటు వైద్యశాలలు సైతం రోగులతో కిక్కిరిసిపోతున్నాయి. ఏ ఇంట్లో చూసినా జ్వర పీడితులు, డెంగీ బాధితులే ఉండటంతో ఆస్పత్రులన్నీ కిటకిటలాడుతున్నాయి. రోగుల సంఖ్య రోజురోజుకు పెరుగుతుండడంతో ప్రైవేటులోనూ బెడ్లు దొరకడం లేదు. దీంతో మళ్లీ కరోనా నాటి పరిస్థితులు తలపిస్తున్నాయి. ఎక్కువగా వైరల్ ఫీవర్, డెంగీ కేసులే వస్తున్నట్లు ప్రైవేటు దవాఖానల వైద్యులు చెబుతున్నారు.

### విజృంభిస్తున్న డెంగీ

నల్లకుంట ఫీవర్ హాస్పిటల్ సైతం వైరల్, డెంగీ రోగులతో నిండిపోయింది. మొన్నటి వరకు 500నుంచి 800వరకు ఉన్న రోజువారీ ఓపీ ప్రస్తుతం వెయ్యి దాటుతోందంటే పరిస్థితి ఎలా ఉందో అంచనా వేసుకోవచ్చు. జూలై, ఆగస్టు నెలల్లోనే ఇప్పటి వరకు 714 డెంగీ కేసులు నమోదైనట్లు అధికారిక గణాంకాల ద్వారా తెలుస్తున్నది. కాగా, విజృంభిస్తున్న దోమల కారణంగానే నగరంలో డెంగీ కేసుల సంఖ్య పెరుగుతున్నట్లు వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు చెబుతున్నారు.

# వ్యాసరచన పోటీల్లో రమ్యశ్రీకి మొదటి బహుమతి

- ఇర్విన్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థిని


రమ్యశ్రీకి బహుమతి అందజేస్తున్న రాష్ట్రపతి నిలయం ఎండీ డాక్టర్ రజినీప్రియ

మాడ్గుల, ఆగస్టు 29 : తెలుగుభాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని బొల్లారంలోని రాష్ట్రపతి నిలయంలో 'ప్రపంచీకరణ నేపథ్యంలో తెలుగు భాష ఎదుర్కొంటున్న సవాళ్లు' అనే అంశంపై నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో విద్యార్థిని రమ్యశ్రీ మొదటి బహుమతి గెలుచుకుంది. జడ్పీహెచ్‌ఎస్ ఇర్విన్ పాఠశాలలో పదో తరగతి చదువుతున్న రమ్యశ్రీకి గురువారం జరిగిన కార్యక్రమంలో రాష్ట్రపతినిలయం ఎండీ డాక్టర్ రజినీప్రియ బహుమతి అందజేశారు. విద్యార్థినిని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పర్వతాలు, ఉపాధ్యాయులు అభినందించారు. గైడ్ టీచర్లు కరుణాకర్‌రెడ్డి, విఘ్నేశ్వర్ పాల్గొన్నారు.


## నీటి సరఫరా బంద్

సిటీబ్యూరో, ఆగస్టు 29 (నమస్తే తెలంగాణ) : జలమండలి ఓఅండ్ఎం డివిజన్-2 బాలాపూర్ రిజర్వాయర్ పరిధిలోని గుర్రం చెరువు నుంచి సన్నీ గార్డెన్స్ వరకు ఎస్ఎన్‌డీపీ డ్రెయిన్ నిర్మాణ పనులు జరుగుతున్నాయి. బాక్స్ డ్రెయిన్ నిర్మాణానికి ఇబ్బందులు కలుగకుండా బాలాపూర్ రిజర్వాయర్ ఔట్‌లెట్ 450 ఎంఎం డయా పైపులైన్ డైవర్షన్ పనులు చేపట్టనున్నట్లు అధికారులు పేర్కొన్నారు. ఈ పనులు శుక్రవారం (నేడు) సాయంత్రం 9 గంటల నుంచి మరుసటి రోజు శనివారం (రేపు) రాత్రి 8 గంటల వరకు జరుగుతాయని చెప్పారు. ఈ కారణంగా పలు ప్రాంతాల్లో నీటి సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని తెలిపారు. రాజా నరసింహ కాలనీ, ఇందిరానగర్, పిసల్‌బండా, దర్గా బురాన్షాహి, గాజీ-మిల్లత్, జీఎం చౌని, లలితాబాగ్, ఉప్పుగూడ, డీఎంఆర్ఎల్, డీఆర్‌డీఎల్, గారిసన్ ఇంజినీర్-1, 2, డీఆర్‌డీవో మిధాని, ఒవైసీ హాస్పిటల్, బీడీఎల్, సీఆర్‌పీఎఫ్ కేంద్రీయ విద్యాలయం, హస్నాబాద్, ఖలందానగర్, తదితర ప్రాంతాల్లో నీటి సరఫరా ఉండదని పేర్కొన్నారు.

# డెంగీ నివారణకు కట్టుదిట్టమైన చర్యలు

- ప్రతి రోజు యాంటీ లార్వా ఆపరేషన్లు ఉదయం 8 గంటలకే ప్రారంభించాలి
- అధికారులకు దిశా నిర్దేశం చేసిన పురపాలక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ దాన కిశోర్

సిటీబ్యూరో, ఆగస్టు 29(నమస్తే తెలంగాణ): డెంగీ, మలేరియా, చికున్‌గున్యా, దోమల ద్వారా వ్యాపించే వ్యాధులను నియంత్రించడానికి కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని పురపాలక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ దాన కిశోర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. జీహెచ్‌ఎంసీ అధికారులు, జిల్లా కలెక్టర్, జోనల్, డిప్యూటీ కమిషనర్లు, చీఫ్ మెడికల్ ఆఫీసర్‌లు, సీనియర్ ఎంటమాలజీ, ఏఎంహెచ్‌ఓలు, తహశీల్దార్లు, అసిస్టెంట్ ఎంటమాజిస్టులు చేపట్టాల్సిన కార్యాచరణపై దాన కిశోర్ గురువారం దిశా నిర్దేశం చేశారు. డెంగీ పాజిటివ్ కేసులన్నింటిని తనిఖీ చేయాలని, ప్రతిరోజు బస్తీ దవాఖానలను, పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను సందర్శించాలని చెప్పారు. జోనల్ కమిషనర్లు డెంగీ, మలేరియా చికున్‌గున్యా, ఇతరవ్యాధులపై క్రమం తప్పకుండా డీసీలు, ఎస్ఈలు, ఏఈలతో సమీక్షించాలని ఆదేశాలు జారీ చేశారు. అన్ని పాఠశాలలు, కళాశాలలు, హాస్టళ్లను సందర్శించి డెంగీ నివారణపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, ప్రతి రోజూ సాయంత్రం ఆరు నుంచి రాత్రి తొమ్మిది గంటల వరకు ఫాగింగ్ చేపట్టాలని దానకిశోర్ సూచించారు. స్లమ్ ఏరియాలో పాజిటివ్ కేసులు గల ప్రాంతాల్లో ఫాగింగ్ చేయాలని, సీనియర్ ఎంటమాలజిస్టులు, అసిస్టెంట్ ఎంటమాలజిస్టులు రోజూ ఐదారు ప్రాంతాలను తప్పకుండా రీ చెక్ చేయాలని సూచించారు.



## జీహెచ్‌ఎంసీలో చేపట్టిన చర్యలు

- డెంగీ నివారణకు ప్రత్యేక చొరవ తీసుకుని వర్షాకాలం ముందు నుంచి ఇప్పటి వరకు పటిష్టమైన చర్యలు తీసుకున్నారు.
- 27,608 ప్రాంతాల్లో, ప్రదేశాలలో యాంటీ లార్వా ఆపరేషన్లు నిర్వహించారు.
- అందులో 9,680 లాక్డ్ హౌసెస్, 767 ఫంక్షన్ హాళ్లలో, 6,157 లాయింగ్ ఏరియా, ఓపెన్ ప్లేస్, 4,635 సెల్లర్స్, 6,370 కన్స్ట్రక్షన్ సైట్‌లలో, 3,045 పాఠశాలలు, 427 కళాశాలలు, 554 హాస్టళ్లలో ఐఈసీ కార్యక్రమాలు నిర్వహించారు.
- గ్రేటర్ వ్యాప్తంగా ఉన్న స్లమ్ ఏరియాలో పాజిటివ్ నమోదైన కాలనీలలో పిన్ పాయింట్ ప్రోగ్రాం ద్వారా ఫాగింగ్ చేశారు.
- 4,846 కాలనీలలో ఇంటింటితో పాటు ప్రతి శుక్రవారం డ్రై డే ఐఈసీ కార్యక్రమాలు నిర్వహించారు.
- అదే విధంగా వెక్టర్ బ్రోన్ వ్యాధులపైన రెసిడెన్షియల్ అసోసియేషన్, ప్రతినిధులు కాలనీ ప్రజలతో కలిసి అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరిగింది.
- 2,751 మంది ఆయా పాఠశాలల విద్యార్థులు వాలంటీర్లుగా గుర్తించి వారితో డెంగీ వ్యతిరేక పోరాటం చేసేందుకు అవగాహన ఇవ్వడం జరిగింది.
- డెంగీ జ్వరం వచ్చిన బాధితులకు 4 - 5 రోజుల్లోనే డెంగీ ఎలిసా టెస్ట్ ద్వారా గుర్తించి, నివారణ చర్యలు తీసుకుంటున్నట్లు అధికారులు పేర్కొన్నారు.